# తహసీల్దార్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం


తహసీల్దార్ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 4 : నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్‌లో శుక్రవారం మంత్రి దామోదర రాజనరసింహ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మంత్రి దామోదర రాజనరసింహ వెళ్తున్న క్రమంలో మంత్రి సమక్షంలోనే బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు జై బీఆర్ఎస్, జై కాంగ్రెస్, జై సునితమ్మ, జై దామోదర అంటూ పరస్పరం పెద్ద ఎత్తున నినాదాలు చేయడం ప్రారంభించారు. ఈ నినాదాలతో అక్కడ వాతావరణం ఒక్క సారిగా ఉద్రిక్తంగా మారింది. మంత్రి వెళ్లిన అనంతరం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మిగతా చెక్కులు అందజేయడానికి స్టేజ్ పైకి వచ్చి మైక్ అడగగా, అక్కడ ఉన్న అధికారులు ఎవరూ స్పందించకపోవడంతో ఆగ్రహానికి గురయ్యారు. వెంటనే అక్కడ ఉన్న తహసీల్దార్ శ్రీనివాస్‌ను పిలిచి మైక్ ఇవ్వాలని కోరగా, తనకు తెలియదనడంతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అసహనానికి లోనయ్యా రు. దీంతో అక్కడున్న బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపడుతున్నప్పుడు నిర్లక్ష సమాధానం ఏమిటని మండిపడ్డారు. దీంతో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పార్టీ నా యకులను శాంతింప జేశారు.

# ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపునకు ఆఫర్

- 5 శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశాలు
- చెల్లించే వారికి 'ఎర్లీబర్డ్' పథకం


మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 4 : సక్రమంగా పన్నులు చెల్లించే వారిని ప్రోత్సహించడంతో పాటు మున్సిపాలిటీలకు ఆదాయాన్ని సమకూర్చేందుకు రాష్ట్ర పురపాలక శాఖ ఓఅవకాశం కల్పించింది. ఎర్లీబర్డ్ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను ఎలాంటి బకాయిలు లేకుండా చెల్లించిన వారికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెలాఖరులోపు ఆస్తి పన్ను చెల్లిస్తే 'ఎర్లీబర్డ్' పథకంలో భాగంగా 5 శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఆఫర్ ప్రకటిస్తూ ఈనెల ఒకటిన ఆదేశాలు జారీ చేసింది. నివాస గృహాలు, వాణిజ్య సముదాయ భవనాలకు ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ అందనున్నది. ఈ మినహాయింపు ఈనెల చివరి వరకు గడువుగా నిర్ణయించింది. జిల్లాలోని మెదక్‌తో పాటు రామాయంపేట, తుఫ్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీలు ముందస్తు ఆస్తిపన్నులపై ప్రత్యేక దృష్టి సారించాయి.

**ఏప్రిల్ 30 వరకే..**

నివాస గృహాలు, వాణిజ్య సముదాయల పన్నుల ముందస్తు చెల్లింపునకు సంబంధించిన ఈ ఆఫర్ ఏప్రిల్ 30 వరకే వర్తిస్తుంది. ఆస్తి పన్ను రూ. లక్ష చెల్లించే వారికి రూ.5 వేలు తగ్గింపు, రూ. వెయ్యి ఉంటే రూ. 950 చెల్లించాలి. ఆస్తి పన్నును ఆన్‌లైన్‌లో, నేరుగా మున్సిపల్ కార్యాలయంలో గానీ చెల్లించవచ్చు.


మున్సిపల్ కార్యాలయం

**సద్వినియోగం చేసుకోవాలి**



2025-26 సంవత్సరానికి ముందస్తు ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రాయితీని పొందేందుకు మున్సిపల్ శాఖ అవకాశం కల్పించింది. దీనిని ఆస్తి పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలి. రాయితీ గురించి పట్టణంలో విస్తృతంగా ప్రచారం కల్పిస్తాం. బిల్ కలెక్టర్లు ఇంటింటికీ వెళ్లి ఆస్తిపన్ను దారులకు అవగాహన కల్పించాం. ఈ సదావకాశాన్ని పట్ట ణ ప్రజలు సద్వినియోగం చేసుకొని పట్టణ అభివృద్ధికి భాగస్వామ్యులు కావాలి.

-శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

# చలివేంద్రం ప్రారంభం


రామాయంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎం సురేఖ

రామాయంపేట, ఏప్రిల్ 4 : ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, సంఘ సేవకుడు కోటి సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం రామాయంపేట బస్టాండ్‌లోని ప్రయాణికుల దాహం తీర్చడానికి శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య క్షేత్రం అధ్వర్యంలో ఉచిత నీటి పంపిణీ కార్యక్రమాన్ని డీఎం ప్రారంభించారు. రామాయంపేటలో జ్యోతిర్లింగ ది వ్యక్షేత్రం అధ్వర్యంలో ఉచితంగా తాగునీటిని ప్రయాణికులకు అందజేయడం హర్షించ దగ్గ విషయమన్నారు. ఆర్టీసీ డిపో సీఐ వీరబాబు, రామాయంపేట కంట్రోలర్ ప్రసాద్, బాదె గురువయ్య, ఎనిశెట్టి లక్ష్మీపతి, దామోదర్ రావు, పబ్బ పెంటయ్య, లావణ్య, సత్యం, తదితరులు ఉన్నారు.

# ఘనంగా నల్లపోచమ్మ జాతర

**పాల్గొన్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి**

చిలిపిచెడ్, ఏప్రిల్ 4 : మండలంలోని జగ్గంపేటలో మూడు రోజు నుంచి నిర్వహించిన నల్లపోచమ్మ దేవత జాతరలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నల్లపోచమ్మ దేవత అశీస్సులతో నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలశాంతులతో ఉండాలని మొక్కలు చెల్లించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి,మాజీ సర్పంచ్‌లు అనంతరామాగౌడ్, పోచయ్య,మండల నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

**విద్యాలయాలు భవిష్యత్ నిర్మాణాలయాలు**

కౌల్చారం, ఏప్రిల్ 4: విద్యాలయాలు విద్యార్థుల భవిష్యత్‌ను నిర్మించే ఆలయాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిన్న ఘనపూర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారికి మార్గాన్ని చూపిస్తారన్నారు. ఎంఈవో సత్యనారాయణ, నీలకంఠం, నాయకులు ఆవుల రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

**సన్నబియ్యం పథకాన్ని శాశ్వతంగా కొనసాగించాలి**

కౌల్చారం, ఏప్రిల్ 4 : మండల పరిధిలోని చిన్నఘనపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం చౌకధరల దుకాణంలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. నాయకులు నరేందర్ రెడ్డి, భాగారెడ్డి, సంతోశ్ కుమార్, కొమ్ముల యాదాగౌడ్, కాశీనాథ్, గౌరి శంకర్ పాల్గొన్నారు.



రాంపూర్‌లో పెద్దమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాల ఊరేగింపు చేపట్టారు. -అల్లాదుర్గం, ఏప్రిల్ 4

# కమిషనర్‌ను సత్కరించిన ఈద్గా కమిటీ


మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న ఈద్గా కమిటీ సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 4 : రంజాన్‌కు జిల్లా కేంద్రంలోని ఈద్గాలో మౌలిక సదుపాయలు కల్పించడం, ప్రార్థనలకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా పారిశుధ్య పనులు తదితర చర్యలు తీసుకున్న మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఈద్గా కమిటీ సభ్యులు సన్మానించారు. మహ్మద్ ఎజాజోద్దీన్, మీర్ అజ్గర్ అలీ, మహ్మద్ సాబేర్ పాష, మహ్మద్ అజీజ్ ఉన్నారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ


మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

జగదేవపూర్, ఏప్రిల్4: మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన గోదాల భాస్కర్‌రెడ్డి తల్లి సరోజన మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి శుక్రవారం గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసుశ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి, మండల నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులు పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు యాదవరెడ్డి, దయాకర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, భాస్కర్, మధు, మల్లేశం, నారాయణ, రామచంద్రం, స్వామి, దేవేందర్ పాల్గొన్నారు.

## గ్రామ పాలనాధికారులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : గ్రామ పాలనాధికారులుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన మాజీ వీఆర్‌వోలు, వీఆర్ఎలు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 16వ తేదీలోపు గూగుల్ ఫామ్ నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్వయంగా సంతకం చేసిన కాపీని కలెక్టర్ కార్యాలయం (సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం)లో సమర్పించాలని అన్నారు. పని స్వభావం, నియమ నిబంధనలతో పాటు ఇతర వివరాల కోసం https:/ccla.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని కలెక్టర్ సూచించారు.

# ఆలయ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పూజలు


ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, ఏప్రిల్ 4 : పాపన్నపేట మండల పరిధిలోని కొడపాకలో శుక్రవారం నిర్వహించిన పోచమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సంగప్ప, గురుమూర్తి, లింగారెడ్డి, కిష్టయ్య, రాజయ్య, నవీన్‌గౌడ్, మల్లేశం, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు కాశీనాథ్, శంకర్, దత్తు, వెంకటేశం, భూషణం పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట, ఏప్రిల్ 4 : మండలంలోని పలువురు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అందజేశారు. భీమ్లతండాకు చెందిన కాట్రోత్ శ్రీకాంత్‌కు రూ. 57 వేలు, పాంబండ గ్రామానికి చెందిన కెతావత్ రమేశ్‌నాయక్‌కు రూ. 45,500 మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీకో-ఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, నాయకులు యాదాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, నువ్వుల దశరథ, ఉన్నారు.

**చేగుంటలో..**

చేగుంట, ఏప్రిల్ 4 : చేగుంట మండలం పోతాన్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన దొంతి రాణికి సీఎంఆర్ఎఫ్ చెక్కును చేగుంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి అందజేశారు. మండల పరిధిలోని పోతాన్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన దొంతి రాణి అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందింది. రాణికి మంజూరైన రూ. 60 వేల చెక్కును శుక్రవారం బాధిత కుటుంబానికి నారాయణరెడ్డి అందజేశారు. మాజీ సర్పంచ్ నెల్లూర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

**మనోహరాబాద్‌లో..**

మనోహరాబాద్, ఏప్రిల్ 4 : మనోహరాబాద్ మాజీ ఎంపీపీ పురం నవనీత రవి ముదిరాజ్ సహకారంతో సునీల్ కుమార్‌కు మంజూరైన రూ. 60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ నేత పురం రవి ముదిరాజ్ శుక్రవారం లబ్ధిదారుడికి అందజేశారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు పురం రవి ముదిరాజ్

# కరాటేలో సిద్దార్థ్ విద్యార్థుల ప్రతిభ



బెల్టులు సాధించిన విద్యార్థులతో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 4 : తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మాచవరంలోని రాజరాజేశ్వరి గార్డెన్‌లో జిల్లాస్థాయి తైక్వాండో ప్రమోషన్ కరాటే టెస్ట్‌లో సిద్దార్థ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి పలు బెల్టులు సాధించారు. బెల్టులు సాధించిన విద్యార్థులుకు తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ సభ్యులు ప్రదీప్ కుమార్, సురేశ్, కృష్ణ బెల్టు లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ సభ్యులను శాలువాలతో సత్కరించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 4 : మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాన్వల్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్ వైపు ముందుకు సాగాలన్నారు. ఎవరైనా నిషేధిత మాదక ద్రవ్యాల యొక్క సమాచారాన్ని తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మిషన్ భగీరథ నీటి స్వచ్ఛత పరీక్షలు


నిజాంపేటలో మిషన్ భగీరథ నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నిజాంపేట, ఏప్రిల్ 4 : నిజాంపేటలోని ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ హెల్పర్ పరుశరాములు నీటి స్వచ్ఛత పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి ఆదేశాల మేరకు ఇంటింటికీ తిరుగుతూ వాటర్ ట్యాం కుల నుంచి నల్లాల ద్వారా ఇండ్లకు సరఫరా అయ్యే భగీరథ నీటిలో క్లోరిన్ శాతాన్ని క్లోరినేషన్ టెస్ట్ ద్వారా పరీక్షలు చేపట్టామన్నారు. స్వచ్ఛమైన భగీరథ నీటిని ఇంటింటికీ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ వాటర్ మెన్ రాజు ఉన్నారు.

## రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులను వేగవంతం చేయాలి


ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సీఈవో

రామాయంపేట, ఏప్రిల్ 4 : రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా సీఈవో ఎల్లయ్య అన్నారు. శుక్రవారం రామాయంపేటలో రికార్డులను పరిశీలించి ఆపరేటర్లకు ప లు సూచనలు సలహాలిచ్చారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**నర్సరీల్లో మొక్కలను కాపాడాలి :** రామాయంపేట మండల వ్యాప్తంగా నర్సరీల్లో ఉన్న మొక్కలను కాపాడాలని సీఈవో ఎల్లయ్య కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం రామాయంపేట మండలంలోని శివాయపల్లి గ్రామంలోని నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున నర్సరీలోని మొక్కలు ఎండి పోకుండా గ్రీన్ మ్యాట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్, సిబ్బంది వెంకటేశం, సాయిరాజ్ తదితరులు ఉన్నారు.

# రేషన్ షాపులకు అందని సన్న బియ్యం


చండూర్‌లో రేషన్ షాపులకు ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో బంద్ ఉన్న షాపు

చిలిపిచెడ్, ఏప్రిల్ 4 :ప్రభుత్వం సన్న బియ్యం అందించాలన్న సంకల్పంతో ఉగాది పండుగ రోజు ప్రారంభించారు. కానీ చిలిపిచెడ్ మండలంలో 14 రేషన్ షాపులు ఉన్న మండల కేంద్రమైన చిలిపిచెడ్ రేషన్ షాపునకు మాత్రమే సన్న బియ్యం అందించారు. మిగితా 13 షాపులకు ఐదు రోజులు గడిచినా ఇప్పటికీ సన్న బియ్యం అధికారులు పంపిణీ చేయలేదు. ప్రభుత్వ అధికారుల ఆదేశాలు ఇంకా రాలేదని రేషన్ డీల ర్ పంపిణీ చేయడం లేదన్నారు. మిగతా 13 రేషన్ షాపులకు ఇంకెప్పుడు సన్న బియ్యం పంపిణీ చేస్తారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సన్న బియ్యం పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 4 : మండల పరిధి జంగరాయికి చెందిన భారతమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సౌజన్యంతో శుక్రవారం రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, బాగారెడ్డి, సురేశ్, సుధాకర్, భూపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్యామ్, నర్సింహులు, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

**నిజాంపేటలో :** నిజాంపేట, ఏప్రిల్ 4 : మండలంలోని చల్మెడకు చెందిన వినోద ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ శుక్రవారం చల్మెడకు విచ్చేసి బాధి త కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేలతో పాటు 25 కిలోల బియ్యం బస్తాను అందజేశారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, రమేశ్, నాయకులు రాజునాయక్, బాబు నాయక్, నరేందర్ నాయక్, శ్రీను, బాబు ఉన్నారు.

## బియ్యం తరలించిన నిందితుల అరెస్టు

మెదక్ (నమస్తే తెలంగాణ) /మెదక్ అర్బన్, ఏప్రిల్ 4 : సీడబ్ల్యూసీ గోదాంలో నుంచి అక్రమంగా బియ్యం తరలించిన ఐదుగురి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు మెదక్ పట్టణ సీఐ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 31న సీడబ్ల్యూసీ గోదామ్ నుంచి అక్రమంగా బియ్యం తరలించిన బానోత్ చందర్, కుకుట్ల సంతోష్ నేరం అంగీకరించడంతో సీడబ్ల్యూసీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మరో ముగ్గురి నిందితులైన కోటేశ్వర్ గోదామ్ మేనేజర్‌ను, శ్యామ్‌కుమార్ టెక్నిషియన్, ఉప్పల సునీల్ కుమార్‌లను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

## ఊరకుక్కల దాడిలో జింక మృతి

రామాయంపేట, ఏప్రిల్ 4 : ఊరకుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన శుక్రవారం రామాయంపేట మండలం తొనిగండ్ల డంపింగ్‌యార్డు వద్ద చోటుచేసుకుంది. అటవీశాఖ డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ నాయక్ కథనం ప్రకారం.. తొనిగండ్ల అటవీప్రాంతం నుంచి గ్రామ శివారులోని డంపింగ్‌యార్డు వద్దకు జింక రావడంతో అక్కడే ఉన్న ఊరకుక్కలు మందగా వచ్చి జింక వెంటబడి గాయపర్చాయి. దీంతో జింక అక్కడికక్కడే మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న రామాయంపేట డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ నాయక్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. డి.ధర్మారం గ్రామానికి చెందిన ప్రభు త్వ పశువైద్యాధికారి శ్రీనివాస్‌కు తెలిపారు. ఘటనా స్థలికి చేరుకున్న వైద్యాధికారి జింకను అటవీశాఖలోనే పోస్టుమార్టం చేశారు. అనంతరం సిబ్బంది అటవీశాఖలోనే జింకను దహనం చేశారు.

## ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 4 : ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇసాక్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. శ్రీరామనవమి సందర్భంగా స్వామి వారి తలంబ్రాలు, ముత్యాలను కార్గో ద్వారా ఇంటి వరకు అందిస్తున్నామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 20 కార్గో సెంటర్ల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. మార్కెటింగ్ ఎగ్జిక్యుటివ్ శివశంకర్, రీజనల్ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, వైద్యనాథ్, తదితరులు ఉన్నారు.

## ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలి


తప్పించుకు తిరుగుతున్న వ్యక్తి (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 4 : ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పలు హత్యలు చేసి తప్పించుకు తిరుగుతున్నాడని ఎవరికైనా కనిపిస్తే చేగుంట పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి అన్నారు. పలు హత్యలు, నేరాలకు పాల్పడుతూ తప్పించుకొని తిరుగుతూ కల్లు దుకాణాలు, మద్యం దుకాణాల వద్ద, లేబర్ అడ్డాల వద్ద ఎక్కువగా ఉంటాడని, రాత్రి వేళలో బస్టాండ్, రైల్వే స్టేషన్లలో పడుకుంటునట్లు సమాచారం ఉన్నది. ఎవరికైనా ఈ వ్యక్తి సమాచారం తెలిసినచో చేగుంట పోలీసులకు 8712657936, 8712657 893 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని శుక్రవారం చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

## విద్యార్థి దుర్మరణం

రామాయంపేట, ఏప్రిల్ 4 : స్కూటీని లారీ ఢీకొన్న సంఘటన రామాయంపేట పట్టణ శివారులోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. రామాయంపేట పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన దేవన్‌పల్లి సాకేత్ (19) స్నేహితుడితో కలిసి హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్య లోని రామాయంపేట పట్టణ శివారు జాతీయ రహదారి వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సాకేత్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు సాకేత్ స్నేహితుడు శివకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే 108లో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న రామాయంపేట పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖాన మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కలకలం సృష్టిస్తున్న మిస్సింగ్

చిలిపిచెడ్, ఏప్రిల్ 4 : ఆడ పిల్లకు జన్మనిచ్చిన ఓతల్లి ఆ ఆడ పిల్లను అమ్ముకుందా.. లేక ఇతర వ్యక్తులు ఎవరైనా అమ్ముకున్నారా అనే విషయం తెలియడం లేదు. ఈ విషయం కొల్చారం, చిలిపిచెడ్ మండల్లాలోని ఓ గిరిజన తండాలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. తండా ప్రజలు తెలిపిన ప్రకారం.. మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం టోప్యి తండాకు చెందిన ఓ మహిళకు వరిగుతం గ్రామ పంచాయతీ పరిధిలోని సీతారామ్ తండాకు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. ఆమె ఆడపిల్లకు జన్మనిచ్చింది. కొన్ని రోజుల తర్వాత వారి ఇద్దరి మధ్య గొడవలు తలెత్తడంతో భర్తను వదిలిపెట్టి పుట్టింటిలో ఉంటున్నది. ఇక్కడ మరో వ్యక్తితో పరిచయం కావడంతో ఆరు నెలల ఆడపిల్లను వారి తల్లిదండ్రుల దగ్గర వదిలి అతడితో వెళ్లిపోయింది. ఈ సమయంలో కొల్చారం మండలం సీతారాం తండాకు చెందిన ఆడపిల్ల తండ్రి కొల్చారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ విషయం స్థానిక ఎస్సై వివరణ కోరగా, ఆ విషయం తమ దృష్టికి వచ్చింది. కానీ తల్లి, పిల్ల మిస్సింగ్ కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని ఎస్సై నర్సింహులు తెలిపారు. ఈ విషయం కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్‌ను వివరణ అడుగగా మిస్సింగ్ అయిన విషయం నిజమే కానీ తల్లి ని పట్టుకున్నాం.. ఆడపిల్ల కూడా త్వరలో తీసుకవస్తామన్నారు.

# డయాలసిస్ సెంటర్ ప్రారంభంతో రోగులకు మేలు


డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

తూప్రాన్, ఏప్రిల్ 4 : డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో చుట్టు ప్రక్కల ప్రాంతాల రోగులకు దూరభారం, వ్యయం తగ్గుతుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం తూప్రాన్ ప్రభుత్వ దవఖానాలో రూ. 80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 5 యూనిట్ల డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూప్రాన్‌లో ట్రామా కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జిల్లా వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం తూప్రాన్ మున్సిపల్ పరిధి అల్లాపూర్ టోల్ ప్లాజా వద్ద ఉన్న బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ రాహుల్ రాజ్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, డీఎంహెచ్‌వో శివ దయాల్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎలక్షన్ రెడ్డి, భూంరెడ్డి, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అమర్ సింగ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన నృత్యాలు



చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో పాఠశాల ప్రిన్సిపాల్ వాణి కుమారి ఆధ్వర్యంలో శుక్రవారం 13వ వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థులు వార్షికోత్సవంలో ఆటపాటలు నృత్యాలు పలువురిని ఆకట్టుకుంటాయి. మాజీ ఉపసర్పంచ్ జీవన్ పాల్గొన్నారు.

-చిన్నశంకరంపేట, ఏప్రిల్ 4